ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం: 29.0 | కనిష్ఠం: 18.0



గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

హన్వాడ, జనవరి 30: మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామ సమీపంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రవినాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మదాబాద్ మండలం నంచర్ల గ్రామానికి చెందిన పల్లె రాంచంద్రయ్య(38) సోమవారం నాయినోనిపల్లి గ్రామ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రాంచంద్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు టైల్స్ పని చేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

చిగురిస్తున్న.. ఆశలు

- నారాయణపేట- కొడంగల్ లిఫ్టునకు ఏర్పాట్లు
- కరువు ప్రాంతాల ప్రజలకు పథకంతో ఊరట
- సీఎం రేవంత్‌రెడ్డి మానసపుత్రిక జీవో నెం 69
- ఈ పథకంతో 1.05 లక్షల ఎకరాలకు సాగునీరు
- 5.50లక్షల జనాభాకు తాగునీటి సదుపాయం



నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి సోమవారం హైదరాబాద్‌లో వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యేలు, సీడబ్ల్యూసీ ఆహ్వానిత సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి



నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి నీరు తీసుకోవాలని ప్రతిపాదించిన భీమా ఫేజ్-1లో ప్రాజెక్టులోని భూత్పూర్ రిజర్వాయర్(ఫైల్)

మహబూబ్‌నగర్/నారాయణపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి మార్గం సుగమం కానుంది. ఏళ్లుగా కరువు పీడిత ప్రాంతాలుగా పేరుగాంచిన మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలోని మెట్ట భూములకు సాగునీరు అందించడం, అలాగే తాగునీటికి ఇబ్బందులు తీర్చాలనే అంశంపై చాలా ఉద్యమాలు జరిగాయి. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఈ ప్రాంతాలకు సాగునీరు ఇచ్చేందుకు నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలని అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అప్పట్లో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతుండటం.. తర్వాత రాష్ట్రపతి పాలన విధించడంతో నాటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ఈ పథకానికి సంబంధించి 2014 మే 23న జీవో నంబర్ 69ని జారీ చేశారు. తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడి.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని చేపట్టలేదు. ఎమ్మెల్యేగా, ఎంపీగా ఉన్న సమయాల్లో రేవంత్‌రెడ్డి ఈ పథకం కోసం కొట్లాడినా.. ఫలితం లేకుండా పోయింది. పేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం పేరుతో జల సాధన సమితి అధ్యక్షుడు అనంతరెడ్డి తదితరులు పోరాటం చేశారు. అయినా తలాపునే కృష్ణానది పరవళ్లు తొక్కుతున్నా.. ఈ ప్రాంతానికి సాగునీరు అందలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకం కోసం కొట్లాడిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో రైతులు, ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ఈ ప్రాంత ఎమ్మెల్యేలు అధికారులతోపాటు, సాగునీటిశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి విన్నవించారు.

నికర జలాల ప్రాజెక్టు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మెజారిటీ ఎత్తిపోతల పథకాలు వరద జలాల ఆధారంగా ఉన్నవే. కాగా.. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం మాత్రమే నికర జలాల ఆధారంగా ప్రతిపాదించిందని చెప్పొచ్చు. 7.10 టీఎంసీల నికర జలాలతో ఈ పథకానికి జీవో 69ని జారీ చేశారు. పథకం కింద నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాల్లోని 1.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.50 లక్షల జనాభాకు తాగునీటిని అందించాలని నిర్ణయించారు. ఉమ్మడి రాష్ట్రంలో రూ.1,450 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. భీమా ప్రాజెక్టుకు 20 టీఎంసీల నికర జలాల కేటాయింపులు ఉండగా.. భీమా 1, 2 ఎత్తిపోతల పథకాలకు 12.90 టీఎంసీలు ఎత్తిపోసేందుకు మాత్రమే డిజైన్ చేశారు. అందులో మిగిలిన 7.10 టీఎంసీల నీటిని భీమా ఫేజ్ 1లో అంతర్భాగంగా నిర్మించిన భూత్పూరు రిజర్వాయర్ నుంచి పేట-కొడంగల్ పథకానికి తీసుకునేందుకు ప్రతిపాదించారు. ఈ పథకం చేపడితే అత్యంత వెనుకబడిన ప్రాంతాలకు నీరందుతుండటంతో కేంద్ర జలశక్తి శాఖ నుంచి 90 శాతం నిధులు పొందే అవకాశం కూడా ఉండేది. భూత్పూరు రిజర్వాయర్ నుంచి నాలుగు దశల్లో ఈ పథకాన్ని చేపట్టాలని నిర్ణయించగా.. ఉట్కూరు, జాజాపూర్, జయమ్మ చెరువు, కానుకుర్తిల వద్ద లిఫ్టులు నిర్మించి.. మార్గం మధ్యలో ఉన్న ఉట్కూరు, జాజాపూర్, జయమ్మ చెరువు, కానుగుర్తి, లక్ష్మీపూర్, ఈర్లపల్లి, దౌల్తాబాద్, హస్నాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట చెరువులను కలుపుకొని నిర్దేశిత ఆయకట్టుకు నీరందించేలా డిజైన్ రూపొందించారు. ఈ పథకం చేపడితే ఉట్కూరు, మక్తల్, నారాయణపేట, ధన్వాడ, దామరగిద్ద, దౌల్తాబాద్, కోస్గి, మద్దూరు, కొడంగల్, బొంరాస్‌పేట మండలాల్లోని 1.05 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. భూత్పూర్ రిజర్వాయర్ నుంచి చివరి ఆయకట్టు వరకు మొత్తం 54 కిలో మీటర్ల కాల్వలతోనే, తక్కువ భూసేకరణతో పూర్తయ్యేలా రూపొందించారు. భూసేకరణ కోసం రూ.130 కోట్లు, సర్వేకు రూ. 3.36 కోట్లు ఖర్చవుతాయని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు.

పీఆర్ఎల్ఐ రీడిజైన్‌తో బ్రేకులు..

జీవో నంబర్ 69 జారీ అయిన వారం రోజుల్లోనే స్వరాష్ట్ర పాలన ప్రారంభమై.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. తర్వాత పాలమూరు జిల్లాలో కల్వకుర్తి, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులను రీడిజైన్ చేసింది. జీవో 69 ద్వారా నారాయణపేట- కొడంగల్ ప్రాంతాలకు నీళ్లివ్వడం కంటే.. రీడిజైన్ చేసిన పీఆర్ఎల్ఐ ద్వారా నీళ్లివ్వాలని నిర్ణయించింది. పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా కరివెన రిజర్వాయర్ నుంచి నారాయణపేట కాలువ(108 కిలోమీటర్లు), ఉదండాపూర్ నుంచి మద్దూరు కాలువ ద్వారా ఈ ప్రాంతాలకు సాగునీరిస్తామని చెప్పింది. తద్వారా పేట పథకంలో పేర్కొన్న 1.05 లక్షల కంటే ఎక్కువగా సుమారు 1.65 లక్షల ఎకరాలకు నీరందిస్తామని తెలిపింది. అయితే స్థానిక రైతాంగం, ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు మాత్రం శ్రీశైలం ఆధారంగా చేపట్టే పాలమూరు ప్రాజెక్టు నుంచి తమ ప్రాంతానికి నీరు రావాలంటే మధ్యలో రెండు జిల్లాలు దాటాల్సి వస్తోందని, ప్రత్యక్షంగా 108 కిలో మీటర్లు అయితే పరోక్షంగా 200 పైచిలుకు కిలోమీటర్ల నుంచి నీరు రావాల్సి ఉంటుందని చెప్పారు. పైగా పాలమూరు పథకం వరద జలాల పథకమని, నికర జలాల కేటాయింపులు ఉండి.. తక్కువ దూరంలో ఇతర జిల్లాలతో ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేని పేట-కొడంగల్ పథకాన్నే చేపట్టాలని ఇక్కడి ప్రజలు డిమాండ్ చేశారు. అయినప్పటికీ.. గత ప్రభుత్వం ఈ పథకాన్ని ఆచరణలోకి తేలేదు. ఇప్పుడు ఈ పథకం కోసం పోరాటం చేసిన రేవంత్‌రెడ్డి సీఎంగా ఉండటంతో త్వరలోనే పనులు ప్రారంభం కావొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



త్వరలోనే పనులు ప్రారంభం

నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణం కోసం ఎన్నికల ముందే హామీ ఇచ్చాం. దీనిద్వారా కరువు పీడిత ప్రాంతాలైన నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాలకు సాగునీరు అందుతుంది. ఇచ్చిన హామీ మేరకు సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశాం. వారు సానుకూలంగా స్పందించారు. అలాగే ఇరిగేషన్ అధికారులతో కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే ఫౌండేషన్ వేసి, పనులు ప్రారంభిస్తాం.

\- చిట్టెం పర్ణికారెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే



స్వాభిమానంతో జీవిస్తారు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో అత్యంత వెనుకబాటులో ఉన్న ప్రాంతాల్లో ముందు వరుసలో నారాయణపేట, కొడంగల్, మక్తల్ ప్రాంతాలు ఉన్నాయి. ఈ ప్రాంతాలకు సమీపంలోనే కృష్ణానది ఉన్నప్పటికీ ఇక్కడి ప్రజలు సాగునీరు, తాగునీటికి గోస పడ్డారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ప్రారంభమయితే సంతోషం. లక్ష ఎకరాలకు నీరిస్తే ప్రజలు పంటలు పండించుకుని, ఆర్థిక వృద్ధి సాధిస్తారు. స్వాభిమానంతో జీవిస్తారు.

\- అనంతరెడ్డి, జలసాధన సమితి అధ్యక్షుడు

నీటి పారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యేల సమావేశం

నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండటంతో నారాయణపేట, దేవరకద్ర ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, మధుసుదన్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశం అయ్యారు. పథకంపై చర్చించారు. జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు, రెండు నియోజకవర్గాల్లో తాగునీరు అందించడం కోసం ఎమ్మెల్యేలు తగు సూచనలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం చేపట్టకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. పథకాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు అధికారులను ఆదేశించారు.

ఎస్ఐల బదిలీ

- ఉమ్మడి జిల్లాలో 28 మందికి స్థాన చలనం

మహబూబ్‌నగర్, జనవరి 30: పోలీస్ శాఖలో బదిలీల పర్వం కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం అధిక సంఖ్యలో 28 మంది ఎస్ఐలను బదిలీ చేశారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బి.హరిప్రసాద్‌ను పెద్దమందడి నుంచి గోపాల్‌పేటకు, ఎస్కే శంషొద్దీన్‌ను మహబూబ్‌నగర్ ట్రాఫిక్ నుంచి శ్రీరంగాపూర్‌కు, వెంకటస్వామిని శ్రీరంగాపూర్ నుంచి మహబూబ్‌నగర్ వీఆర్‌కు బదిలీ చేశారు. బీ వెంకటేశ్వర్లు గోపాల్‌పేట నుంచి వనపర్తి వీఆర్‌కు, వి.జయన్న వనపర్తి టౌన్ నుంచి వనపర్తి టౌన్ 1కు, జి.యుగంధర్ వనపర్తి టౌన్ నుంచి వనపర్తిలో వీఆర్‌గా, ఈ.శివకుమార్ రేవల్లె నుంచి పెద్దమందడికి, పి.జలంధర్‌రెడ్డి డీఎస్‌బీ వనపర్తి నుంచి వనపర్తి రూరల్‌కు, కర్రె శేఖర్‌రెడ్డి బల్మూర్ నుంచి రేవల్లెకు, ఎం.చంద్రశేఖర్ వీఆర్ మహబబూబ్‌నగర్ నుంచి మానవపాడుకు, కొందూరు రాము మానవపాడు నుంచి జోగులాంబ డీఎస్‌బీకి ట్రాన్స్‌ఫర్ చేశారు. జగదీశ్వర్‌రెడ్డి పెబ్బేర్ నుంచి రాజోలి అటాచ్‌కు, ఎంఏ ఖదీర్ రాజోళి నుంచి డీఎస్‌బీ జోగులాంబకు, ఎం.సంతోష్ వీఆర్ వనపర్తి నుంచి శాంతినగర్‌కు, వి.వెంకటేశ్ కేటీదొడ్డి నుంచి ఇటిక్యాలకు, పి.అశోక్‌బాబు ఇటిక్యాల నుంచి మహబూబ్‌నగర్ వీఆర్‌కు, సి.కుర్మయ్య నర్వ నుంచి నారాయణపేట వీఆర్‌కు, ఏ.నాగరాజు డీసీఆర్‌బీ మహబూబ్‌నగర్ నుంచి అలంపూర్‌కు, ఎం.రమేశ్ అలంపూర్ నుంచి డీఎస్‌బీ జోగుళాంబకు బదిలీపై వెళ్లారు. కె.శ్రీనివాసులు మూసాపేట నుంచి ఉండవెల్లికి, ఏ.పర్వతాలు వీఆర్ నారాయణపేట నుంచి గద్వాల రూరల్‌కు, పి.శ్రీనివాసరావు వీఆర్ నారాయణపేట నుంచి కేటీదొడ్డికి, వల్లూరు వెంకటేశ్ కేటీదొడ్డి నుంచి వీఆర్ నారాయణపేటకు, సి.సురేశ్‌గౌడ్ మద్దూర్ నుంచి మల్దకల్‌కు, ఎం.కల్యాణ్ కుమార్ మల్దకల్ నుంచి వీఆర్ నారాయణపేటకు, బి.నందికర్ గట్టు నుంచి డీఎస్‌బీ జోగులాంబకు, ఎం.రామకృష్ణ డీఎస్‌బీ గద్వాలనుంచి గట్టుకు బదిలీ చేశారు.

టాస్క్ పేరుతో మోసం

ఉప్పునుంతల, జనవరి 30: టాస్క్ పేరుతో డబ్బులు పోగొట్టుకున్న ఓ యువకుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సైబర్ క్రైమ్ కేసు నమోదు చేశారు. ఏఎస్సై అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం తాడూరు గ్రామానికి చెందిన గుండమోని రాంబాబు అనే విద్యార్థి ఈనెల 19వ తేదీన మొబైల్‌లో వాట్సాప్ చూస్తుండగా ఓ టెలీగ్రామ్ లింక్ వచ్చింది. లింక్‌ను క్లిక్ చేయగా వ్యక్తిగత సమాచారం అప్‌లోడు చేయమని సూచించారు. మూడు టాస్కులు పూర్తిచేస్తే మీ డబ్బులు వస్తాయని నమ్మించారు. దీంతో రాంబాబు రెండు గేమ్స్ విజయవంతం చేశాడు. మూడో గేమ్ పూర్తి చేయడానికి కొంత డబ్బులు చెల్లించాలని సూచించారు. వాట్సాప్‌లో యూపీఐ లింకు పంపారు. యూపీఐపై క్లిక్ చేయగా అకౌంటులో ఉన్న రూ.28 వేలు కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. గమనించిన రాంబాబు వెంటనే సైబర్ క్రైమ్ టీమ్ 1930కు ఫోన్ చేశాడు. మంగళవారం రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

సమష్టి కృషితోనే సమగ్రాభివృద్ధి

- జడ్పీ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేస్తేనే సమగ్రాభివృద్ధి సాధించగలుగుతామని రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నందున ఆ దిశగా అడుగులు వేయాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 45 నిమిషాలు ఆలస్యమైంది. సమావేశంలో ప్రధాన శాఖల ప్రగతి, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి గ్రామానికో గురుకుల పాఠశాల విద్యను ప్రభుత్వ పాఠశాలలోనే అందించవచ్చన్నారు. ప్రజాప్రతినిధులకు వచ్చే నిధులు, కలెక్టర్ నుంచి కొన్ని నిధులు, మిగిలినవి చందా వసూలు చేసి ప్రతీ గ్రామ పంచాయతీలో శారీరక వ్యాయామం, విద్యను అందిస్తే గురుకుల పాఠశాల స్థాయిలో విద్యను అందించొచ్చన్నారు. ఉదయం ఆరు గంటల నుండి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఏడు గంటల వరకు ఆ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులకు అదనంగా ప్రైవేట్‌గా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. విద్యుత్ శాఖ సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన్ననూర్ నుంచి వటవర్లపల్లి వరకు ఉన్న విద్యుత్ వైర్లు వేలాడుతూ, చాలా చోట్ల తీగలు తెలి షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయని అచ్చంపేట ఎమ్మెల్యే సభ దృష్టికి తెచ్చినందున కొత్తగా కేబుల్ మార్చడానికి ఎన్ని నిధులు అవసరమో ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. గత ఐదారు సంవత్సరాల్లో మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్లు, పూర్తయినవి, వ్యవసాయ బోరు బావులకు రైతులు కట్టిన డీడీలు ఎన్ని?, ఎన్నింటికీ కనెక్షన్లు ఇచ్చారు?, పెండింగ్ వివరాలు, గ్రామాల్లో ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్ అలైన్మెంట్ మార్చాల్సినవి ఎన్ని?, వాటికి ఎన్ని నిధులు ఎంత కావాలనేది పూర్తి వివరాలతో పెన్‌డ్రైవ్‌లు ప్రజాప్రతినిధులందరికీ ఇవ్వాలని ఆదేశించారు. వారం తర్వాత విద్యుత్ శాఖపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శాంతాకుమారి మాట్లాడుతూ ప్రతి గ్రామానికీ బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి అవాంతరాలు లేకుండా చూడాలని రోడ్డు రవాణా శాఖ అధికారికి సూచించారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న బెల్టుషాపులను క్రమంగా నిషేధించాలన్నారు. కిరాణం షాపుల్లో సైతం బెల్టుషాపులు నడుపుతున్నారన్నారు. హైదరాబాద్ నుంచి మాదకద్రవ్యాలు తెప్పించి విక్రయిస్తున్నారని, వాటికి విద్యార్థులు, యువత బానిసలై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. నేరాల సంఖ్య, యాక్సిడెంట్లు పెరుగుతున్నాయన్నారు. మాట్లాడుతూ పోడు భూముల్లో తరతరాలుగా సాగులో ఉన్న వారిని గుర్తించి అర్హులైన వారందరికీ హక్కు పత్రాలు జారీ చేయాలన్నారు. రాయవరం, క్యాంప్ రాయవరం వంటి ప్రాంతాల్లో అర్హత లేని వారికి ఇప్పటికే ఇచ్చి ఉంటే వాటిని రద్దు చేయాలని సూచించారు. స్పందించిన కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అనర్హులకు ఎవరికీ పోడు భూమి హక్కు పత్రాలు ఇవ్వలేదని చెప్పారు. అమ్రాబాద్ మండలంలోని ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, ప్రైవేట్ ఉర్దూ ఉపాధ్యాయులను నియమిస్తే వసతి ఉచితంగా కల్పిస్తామని విద్యాశాఖ అధికారికి సూచించారు. పలు అంశాలపై ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు అధికారులను ప్రశ్నలు అడిగారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సమాయత్తం



గద్వాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్ పరీక్షల ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐఈవో హృదయరాజు

- ముమ్మరంగా సాగుతున్న ప్రత్యేక తరగతులు
- రేపటి నుంచి ప్రాక్టికల్స్
- వచ్చే నెల 28 నుంచి వార్షిక పరీక్షలు

గద్వాల టౌన్, జనవరి 30: వార్షిక పరీక్షలకు ఇంటర్మీడియట్ విద్యార్థులు సమాయత్తం అవుతున్నారు. డిసెంబరు చివరి నాటికే సిలబస్ పూర్తి చేసిన అధ్యాపకులు జనవరి మొదటి వారం నుంచి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారు ప్రత్యేక తరగతులకు విధిగా హాజరయ్యేలా అధ్యాపకులు చొరవ చూపుతున్నారు. వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మొదటి సంవత్సరం పరీక్షలు, మార్చి ఒకటి నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 14 వరకు కొనసాగుతాయి. ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి 10 వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వారికి ప్రత్యేక ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు అధ్యాపకులు చెబుతున్నారు. ఈ సారి అవాంతరాలు లేకుండా తరగతుల నిర్వహణ సాఫీగా సాగిన నేపథ్యంలో సిలబస్ కూడా సకాలంలోనే పూర్తి చేశామని, ప్రత్యేక తరగతుల నిర్వహణ వల్ల ఫలితాలు మెరుగుపడే అవకాశం ఉంటుందని వారు అంచనా వేస్తున్నారు.

ప్రాక్టికల్ పరీక్షలు

ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. తర్వాత ఆరో తేదీ నుంచి పదో తేదీ వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

పరీక్షల కోసం విద్యార్థులు ఆందోళన చెంది, ఒత్తిడికి గురికావాల్సిన అవసరం లేదు. ఇప్పటికే సిలబస్ పూర్తిచేసి, పునఃశ్చరణ తరగతులు పూర్తి చేశాం. ప్రత్యేక తరగతులను రోజూ నిర్వహిస్తున్నాం. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సబ్జెక్టులన్నింటినీ ప్రణాళికాబద్ధంగా అధ్యాపకులు సూచన మేరకు చదువుతూ, పరీక్షలకు సిద్ధం కావాలి.

\- ఎం.హృదయరాజు, డీఐఈవో

జిల్లాల వారీగా జూనియర్ కళాశాలలు, పరీక్ష రాయనున్న విద్యార్థులు, కేంద్రాల సంఖ్య

జిల్లా	ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు	పరీక్ష రాయనున్న విద్యార్థులు
జోగుళాంబ గద్వాల	41	8,085
వనపర్తి	43	10,100
మహబూబ్‌నగర్	86	13,096
నాగర్‌కర్నూల్	41	5,745
నారాయణపేట	38	8,273

బైకు, కారు ఢీకొని ఇద్దరి దుర్మరణం



ప్రభాకర్, భాను(ఫైల్)

మక్తల్, జనవరి 30 : బైకు, కారు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాచ్‌వార్ సమీపంలోని 167 జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం మేరకు ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మక్తల్ పట్టణానికి చెందిన ప్రభాకర్ (37), బాల్‌రాజ్ అలియాస్ భాను(35)లు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యుడికి సహాయకులుగా పనిచేస్తున్నారు. పదేళ్ల క్రితం ప్రభాకర్ కాచ్‌వార్‌కు ఇల్లరికం వచ్చాడు. అప్పటి నుంచి ప్రభాకర్ కాచ్‌వార్‌లో నివాసం ఉంటూ మక్తల్‌కు వెళ్లేవాడు. కాగా వీరిద్దరూ స్నేహితులుగా కలిసిమెలిసి ఉండేవారు. ఈ క్రమంలో తమ సొంత పనిపై జక్లేర్ వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా కాచ్‌వార్ సమీపంలో హైదరాబాద్ వైపు నుంచి ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నది. ఈ సంఘటనలో వీరిద్దరికీ తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలో పడ్డారు. స్థానికులు వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రభాకర్‌కు భార్య రాధతో పాటు ఏడేళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు. బాల్‌రాజ్ అలియాస్ భానుకు భార్య మమతతో పాటు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కాచ్‌వార్‌కు ఇల్లరికం వచ్చిన ప్రభాకర్ కాచ్‌వార్ సమీపంలోనే మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ సంఘటనపై ఇరు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

మహబూబ్‌నగర్ బరిలో ఉండేది నేనే

- మహబూబ్‌నగర్.. జితేందర్‌రెడ్డి అడ్డా
- తేల్చిచెప్పిన మాజీ ఎంపీ
- మోదీ మరోసారి ప్రధాని అవుతారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జితేందర్‌రెడ్డి

గద్వాల, జనవరి 30: పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానం నుంచి బీజేపీ తరఫున పోటీలో ఉండేది తానేనని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ అడ్డా జితేందర్ అడ్డా అని అన్నారు. మంగళవారం గద్వాలలో జరిగిన ఓ ప్రైవేట్ ఫంక్షన్‌కు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో మహబూబ్‌నగర్ ఎంపీగా గెలిచి, ప్రజలకు సేవ చేశానని అన్నారు. ఇప్పుడు కూడా గెలిచి, సేవ చేస్తానన్నారు. నరేంద్ర మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేస్తారని అన్నారు. సనాతన ధర్మం బతికే ఉందనడానికి అయోధ్యలో జరిగిన బలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమమే నిదర్శనమన్నారు. ఎన్నో ఏళ్ల కలను ప్రధాన మంత్రి నిజం చేశారని కొనియాడారు. శ్రీరాముడి పాలనను ప్రతీ ఒక్కరు కోరుకుంటున్నారని, అది బీజేపీతోనే సాధ్యమని అన్నారు. సమావేశంలో నాయకులు యాదగిరిరెడ్డి, అయ్యపురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఇసుక రీచ్‌ల కోసం

మైనింగ్ అధికారుల అన్వేషణ

- పర్యవేక్షణ కోసం గ్రామస్థులతో మాటామంతీ
- వ్యతిరేకిస్తున్న నదీ పరివాహక ప్రాంత రైతులు

తాడూరు, జనవరి 30 : నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఇసుక కొరతను అధిగమించడంతో పాటు ఆర్థికంగా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాలనే ప్రధానోద్దేశంతో జిల్లాలోని దుందుభి నది పరివాహక ప్రాంత గ్రామాల్లో ప్రభుత్వం ఇసుక రీచ్‌లను ఏర్పాటుచేసింది. శాండ్ ట్యాక్సీ ద్వారా అవసరమైన వారందరికీ ఇసుకను సరఫరా చేస్తూ ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే విధంగా జిల్లాలోని మైనింగ్ శాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఇప్పటికే తాడూరు మండలంలోని నది పరివాహక ప్రాంత గ్రామాల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలను మైనింగ్ శాఖ అధికారులు పరిశీలించారు. ప్రధానంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో దుందుభి నది తిమ్మాజిపేట, తాడూరు, కల్వకుర్తి, ఊర్కొండ, తెలకపల్లి, వంగూరు, ఉప్పునుంతల మండలాల్లోని గ్రామాల గుండా నది ప్రవాహం కొనసాగుతోంది. ఈ గ్రామాల్లో ఇసుక రీచ్‌లను ఏర్పాటుచేసి శాండ్ ట్యాక్సీని ఏర్పాటు చేసినట్లయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతితో ఇసుక తరలింపు ప్రక్రియను కొనసాగించవచ్చని మైనింగ్ శాఖ అధికారులు భావిస్తుండగా.. ఇందుకు తగ్గట్టుగానే అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో పర్యవేక్షించి గ్రామస్థులతో మాట్లాడుతున్నారు. అయితే నదీ పరివాహక ప్రాంత రైతులు ఈ ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నదిలో ఇసుకను తీసినట్లయితే భూగర్భజలాలు తగ్గి సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయంటూ రైతులంతా గ్రామస్థుల సహకారంతో మూకుమ్మడిగా గ్రామ పంచాయతీ తీర్మానాన్ని ఏర్పాటుచేసి ఏకంగా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు తాడూరు మండలం పొల్మూరు గ్రామం వద్ద మైనింగ్ శాఖ అధికారులు ఇసుక రీచ్‌ను ఏర్పాటుచేయగా, మరో గ్రామంలో ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఇసుక తీయాల్సిందే..

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను గమనించినట్లయితే దుందుభి నది నుంచి ఇసుకను తీయాల్సిందేనని మైనింగ్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. నది నుంచి ఇసుకను తీయకపోతే గంటల వ్యవధిలోనే అత్యధిక వర్షపాతాలు వచ్చే ప్రమాదాలు ఎక్కువగా కన్పిస్తున్నాయంటూ వారు అభిప్రాయపడుతున్నారు. అలాంటి సమయంలో దుందుభి నదిలో ఇసుక ఎక్కువగా ఉన్నట్లయితే నది పరివాహక ప్రాంత గ్రామాల పైకి వరద ముప్పు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. దీనికితోడు ప్రభుత్వం అనుమతినివ్వక పోయినట్లయితే అక్రమార్కులు దొడ్డిదారిన ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారంటూ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అనుమతినివ్వడంతో అక్రమార్కులకు అడ్డుకట్ట పడి ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశాలున్నాయి.

ఇసుక తీస్తే సాగునీటికి కటకటే

ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుందుభి నదిలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి ఇసుకను తరలిస్తే నది పరివాహక ప్రాంత రైతుల పరిస్థితి అగమ్యగోచరంతో పాటు సాగునీటికి కటకట ఏర్పడుతుంది. ఇప్పటికే కేఎల్ఐ ద్వారా నీరు అంతంతమాత్రంగానే అందుతోంది. దీనిద్వారా దుందుభి నది పరివాహక ప్రాంతంలో జిల్లా వ్యాప్తంగా దాదాపు 50కిలోమీటర్లకు పైగా నది కుడి, ఎడమవైపు ఎక్కువ విస్తీర్ణంలో అన్నదాతలు వ్యవసాయం సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దుందుభి నది నుంచి ఇసుకను అధికారికంగా తీసినట్లయితే ఎక్కడెక్కడి నుంచో దీనిని తరలించుకుపోయేందుకు నదీ తీరం వెంట డంప్ చేసుకుని తరలింపునకు ప్రయత్నాలు ప్రారంభిస్తారు. దీంతో దుందుభి నదిలో పూర్తిగా ఇసుక మాయమై భూగర్భజలాలు తగ్గి సాగునీటికి తీవ్ర ఇబ్బంది నెలకొనే ప్రమాదం ఉందంటూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇందుకు వ్యతిరేకంగా దుందుభి నది పరివాహక ప్రాంత గ్రామాల్లో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయవద్దంటూ గ్రామ పంచాయతీ తీర్మానాలతో కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు సైతం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా దుందుభి నదిలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసినట్లయితే రైతుల సాగునీటికి గడ్డుకాలంగానే భావించవచ్చు.



మేడిపూర్ గ్రామం వద్ద అనుమతి లేకుండా టిప్పర్‌లో ఇసుకను నింపుతున్న ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకుంటున్న గ్రామస్థులు (ఫైల్)

అధికారులతో

జడ్పీ చైర్‌పర్సన్ రహస్య సమావేశం

- వివరాలు గోప్యంగా ఉంచడంపై అనుమానాలు

గద్వాల, జనవరి 30 : జోగుళాంబ గద్వాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత మంగళవారం గద్వాల నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో తన క్యాంపు కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఒక్కో మండల అధికారులతో విడివిడిగా సమావేశం అయ్యారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ప్రత్యేక అధికారుల పాలన వస్తుండటంతో ప్రస్తుతం గ్రామాల పరిస్థితి, నిధుల వివరాలు, ఇప్పటివరకు చేసిన ఖర్చుల వివరాలను తెలుసుకున్నట్లు సమాచారం. అయితే 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్ఎఫ్‌సీ నిధులు కొంత ఖర్చు కాగా, మిగిలిన నిధులు ట్రాక్టర్ల కంతులు, విద్యుత్ బిల్లులు, మల్టీపర్పస్ వర్కర్ల జీతాలకే సరిపోయాయని.. సర్పంచులు చేసిన పనులకు ఇంకా బిల్లులు చెల్లించాల్సి ఉందని నివేదించినట్లు సమాచారం. అయితే ఇకనుంచి మాజీ సర్పంచుల జోక్యం లేకుండా గ్రామ పాలన జరగాలని, ఒకవేళ అధికారులు ఖర్చు చేయలేని పరిస్థితి ఉంటే తమ పార్టీ నాయకులు ఖర్చు చేస్తారని.. నిధులు వచ్చిన త ర్వాత వారికి బిల్లులు చెల్లించాలని సూచించినట్లు సమాచారం. ఎవరి జోక్యం లేకుండా ప్రత్యేకాధికారుల పాలన జరగాలని కోరినట్లు తెలిసింది. కాగా, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హోదాలో ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శులతో నేరుగా సమావేశం చేసుకునే ప్రొటోకాల్ చైర్‌పర్సన్‌కు ఉంది. కానీ సమావేశం, సమావేశ వివరాలు గోప్యంగా ఉంచడంపైనే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

హామీల అమలు

కాంగ్రెస్‌తో సాధ్యం కాదు

- గుంపులో వచ్చిన వారందరినీ నమ్మి మోసపోయాం
- పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పనిచేద్దాం
- కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, జనవరి 30 : ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ ఎన్నో హామీలను ఇచ్చిందని, ఆ హామీలను అమలు చేయడం ఆ పార్టీకి సాధ్యం కాదని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎంపీ ఎన్నికలను పురస్కరించుకొని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌లోకి గుంపులుగా నాయకులు రావడం వల్ల అంతా మనవాళ్లేనని నమ్మి మోసపోయా మని, గుంపులో మోసగాళ్లు ఎవరో తెలియలేదు.. నిజాయితీపరులు ఎవరో తెలియలేదని, కష్టపడ్డ వారిని మర్చిపోయాం.. గుంపులో సైన్యం పెరిగిపోవడం వల్ల అర్థం చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని, అయితే నేరుగా ఆన్‌లైన్ ద్వారా రైతుల అకౌంట్లలో జమ చేయడం వల్ల కష్టపడి పనిచేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లతో ప్రజలకు లింక్ కట్ అయిందన్నారు. ఆన్‌లైన్ ద్వారా కాకుండా నేరుగా ప్రజా ప్రతి నిధుల చేతులమీదుగా పథకాలు అందించి ఉంటే వారికి ప్రజలతో సంబంధాలు ఉండేవన్నారు. పింఛన్ ఎవరిచ్చారంటే పోస్ట్‌మెన్ ఇచ్చాడని అంటున్నారే తప్ప సర్పంచ్ ఇచ్చాడని, ఎమ్మెల్యే ఇచ్చాడని చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో పనిచేసే ప్రజాప్రతినిధుల కష్టం ఏట్లో పచ్చిపులుసు పిసికినట్లయిందని విచారం వెలిబుచ్చారు. కాంగ్రెస్ ఎన్నో హామీలను ఇచ్చిందని, ఆ హామీలను నమ్మి జనం మనం ఇచ్చే పథకాలు మర్చిపోయి కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలనే కోరుకుందామని అన్నారు. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్, బీజేపీ కలిసి నా ఓటమికి పనిచేశా యని, రాష్ట్రంలో ఇలా ఎక్కడా జరగ లేదని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అధిష్ఠానం నిర్ణయం ప్రకారం అభ్యర్థి విజయం కోసం కష్టపడి పనిచేద్దామని పిలుపునిచ్చారు. గత ఎన్నికలో జరిగిన పొరపాట్లను సరిచేసుకుని ముందుకు సాగుదామన్నారు. పార్టీని వీడి పోయేవాళ్లను వదిలేసి ఉన్నవాళ్లతో పనిచేయించుకుందామని, పోయేవాళ్లకు డబ్బులు ఇచ్చి ఆపు కుందామని అన్నారని, కానీ డబ్బుల కోసం పోయేవాళ్లను పెట్టుకుంటే ఉపయోగం ఉండదని పేర్కొన్నారు. కేసులకు ఎవరూ భయపడొద్దని తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికలో జరిగిన పొరపాట్లను మళ్లీ జరగనివ్వకుండా పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పనిచేద్దామన్నారు. రైతుబంధు లేక, కరెంట్ లేక మళ్లీ జనం వలస వెళ్లే పరిస్థితిని కాంగ్రెస్ కల్పిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ అమలుకాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్‌కు అప్పుడే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, ఆ భయం వల్లనే సర్పంచ్ ఎన్నికలకు వెళ్లడం లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, నాయకులు ఇంతియాజ్, రాజేశ్వర్‌గౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, కోరమోని నర్సింహులు, కోరమోని వెంకటయ్య, గంజి ఎంకన్న, సుధాశ్రీ, శివరాజ్, రహమాన్, బాలరాజు, కరుణాకర్‌గౌడ్, గణేష్, కృష్ణమోహన్, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.


మాట్లాడుతున్న వి.శ్రీనివాస్‌గౌడ్

కారు, లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన కారు

జడ్చర్ల, జనవరి 30 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లి, బురెడ్డిపల్లి మధ్య 44వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం కారు, లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కారు, మల్లెబోయిన్‌పల్లి సమీపంలో ఉన్న లారీ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఆంధ్రజ్యోతి హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏడీవీటీ ఏజీఎం రమణారావు, ఆయన భార్య పద్మజలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

సీజ్ చేసిన ఇసుక డంపులు మాయం

- తహసీల్దార్ ఆగ్రహం

రాజోలి, జనవరి 30 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలిలో సోమవారం రెవెన్యూ అధికారులు, పోలీసులు కలిసి సీజ్ చేసిన ఇసుక డంపులు రాత్రికి రాత్రి మాయం అయ్యాయి. మంగళవారం ఉదయం రెవెన్యూ సిబ్బందిని పంపి చూడగా డంపులు మాయమయ్యాయని, ఇసుక మొత్తం రాత్రికి రాత్రి అక్రమంగా తరలించేశారని తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ ఏడీతో తహసీల్దార్ ఫోన్‌లో మాట్లాడారు. ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వవద్దని కోరారు. జిల్లా కేంద్రంలో డీఎల్ఎస్‌సీ సమావేశం ఏర్పాటుచేసి నిర్ణయం తీసుకునేంత వరకు ఎవరికీ అనుమతులు ఇచ్చేది లేదని, అంతవరకు ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడినా, అక్రమంగా ఇసుక డంపు చేసినా సంబంధిత స్థలం యజమానిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

హిజ్రాల పరస్పర దాడులు

- పలువురికి గాయాలు

గద్వాల క్రైం, జనవరి 30 : ప్రాంతీయ భేదం వల్ల హిజ్రాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మంగళవారం చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణానికి చెందిన హిజ్రాలను, మహబూబ్‌నగర్‌కు చెందిన హిజ్రాలు దాడి చేశారని సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తమపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంపై మండిపడ్డ మహబూబ్‌నగర్‌కు చెందిన హిజ్రాలు అయిన ప్రీతి, కావ్య, రమ్యతో పాటు మరికొందరు గద్వాలకు చెందిన ఫైమ, వినూత్నలపై దాడి చేశారు. అనంతరం జమ్ములమ్మ దేవాలయానికి వెళ్తున్న వీరిపై మళ్లీ దాడిచేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పోలీసులు వీరిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆరోగ్య సేవలు భేష్

- రుద్రారం గ్రామాన్ని సందర్శించిన ఢిల్లీ బృందం
- ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ పరిశీలన

నవాబ్‌పేట, జనవరి 30 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం రుద్రారం గ్రామాన్ని ఢిల్లీకి చెందిన జాతీయ ఆరోగ్య మిషన్ బృందం సభ్యులు డాక్టర్ సంగీత్‌సేన్, డాక్టర్ శాలినిచావ్లాలు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను పరిశీలించారు. ఆరోగ్య మందిర్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ లలితమ్మ ఆరోగ్య కేంద్రం, ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య నాణ్యతా ప్రమాణాలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఢిల్లీ బృందం సభ్యులకు వివరించారు. ఆరోగ్య సేవల పట్ల సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నరేష్‌చంద్ర, ఎంపీహెచ్‌ఈవో శ్రీరాములు, రాజచంద్ర, శరభలింగం, వైద్య సిబ్బంది బీమపల్లిగౌడ్, అవినాష్, శిరీష, మాధవి, రజిత, ఆశ సిబ్బంది మమత, జ్యోతి, లక్ష్మమ్మలు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న జాతీయ హెల్త్ మిషన్ సభ్యులు

ధరూరు ఎంపీపీకి ఊరట

- హైకోర్టులో స్టే

ధరూరు, జనవరి 30 : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల ఎంపీపీ నజుమున్నీసాబేగం గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరింది. ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ ఎంపీటీసీ సభ్యులతో పాటు, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్డీవో చంద్రకళకు ఎంపీపీపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రకటించారు. దీంతో ఆమె అవిశ్వాసానికి సంబంధించి హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. ఈ స్టే కాపీని మంగళవారం ఆమె ఆర్డీవో చంద్రకళకు అందించారు. ఎంపీపీ వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజారెడ్డి, బండ్ల వెంకటేశ్వరరెడ్డి, ర్యాలంపాడు నరేంద్రరెడ్డి ఉన్నారు.


ఆర్డీవో చంద్రకళకు స్టే కాపీని అందజేస్తున్న ఎంపీపీ

సౌత్‌జోన్ గేమ్స్‌కు

క్రీడాకారుల పయనం

- చెన్నై బయలుదేరిన పీయూ పురుషుల టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 30 : వచ్చే నెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు చెన్నైలోని అంబేడ్కర్ లా యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ పోటీలకు పీయూ పురుషుల టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు మంగళవారం బయలుదేరి వెళ్లారు. ఎంపికైన క్రీడాకారులకు పీయూ వైస్ చాన్స్‌లర్ ఎల్‌బీ.లక్ష్మీకాంత్‌రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు క్రీడాకారులకు ట్రాక్ షూట్, క్రీడా దుస్తులను అందజేశారు. బాగా ఆడి విజయం సాధించాలని, యూనివర్సిటీకి పేరు తీసుకురావాలని, క్రమశిక్షణతో మెలగాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో కోచ్ అండ్ మేనేజర్ శ్రీనివాసులు తదితరులున్నారు.


పీయూ వీసీ, రిజిస్ట్రార్‌తో పురుషుల టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు

అండర్-14 బాలుర ఉమ్మడి జిల్లా క్రికెట్ సెలక్షన్స్

జడ్చర్ల, జనవరి 30 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాలుర ఉమ్మడి జిల్లా క్రికెట్ సెలక్షన్స్‌ను మంగళవారం జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొనగా, వీరిలో నుంచి బ్యాటింగ్, బౌలింగ్‌లలో క్రీడాకారులు చూపిన ప్రతిభ ఆధారంగా 36 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరిని జట్టుల వారీగా విభజించి, ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడించి, ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో పీఈటీలు రమేశ్‌బాబు, వేణుగోపాల్, శారదాబాయి, వడ్డెన్న, రాంకల్యాణ్, పరుషురాం, మోయిన్, కిట్టు, అబ్దుల్లా, శ్రీను తదితరులున్నారు.


అండర్-14 బాలుర విభాగంలో సెలక్షన్స్ నిర్వహిస్తున్న నిర్వాహకులు

చికిత్స పొందుతూ బీటెక్ విద్యార్థి మృతి

- అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 30 : హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయుడు చిదిరే సతీష్‌కుమార్ పెద్ద కుమారుడు సాయితేజ(19) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఈనెల 26న కళాశాల నుంచి ద్విచక్ర వాహనంపై హాస్టల్‌కు వెళ్తున్న క్రమంలో ఇబ్రహీంపట్నం వద్ద మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో యశోద ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సాయితేజ అవయవాలను కుటుంబ సభ్యులు అక్కడే ఆసుపత్రికి దానం చేశారు.

మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో అశ్రునయనాల మధ్య సాయితేజ అంత్యక్రియలు జరిగాయి. చిన్న వయస్సులో అవయవదానంతో పలువురు ప్రాణాలు కాపాడడానికి సహకరించిన కుటుంబ సభ్యులను ప్రతీ ఒక్కరు అభినందించారు. కుమారుడు కోల్పోయిన బాధలో సైతం అవయవదానానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు సామాజికవేత్తలు అభిప్రాయపడ్డారు.


సాయితేజ (ఫైల్)

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

జడ్చర్ల, జనవరి 30 : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో ఈనెల 25న అదృశ్యమైన వ్యక్తి మృతదేహం మంగళవారం జడ్చర్ల మండలం నక్కలబండ తండా సమీపంలో లభ్యమైంది. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఉమ్మెంతల రాఘవేందర్(39) ఈనెల 25న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. మిడ్జిల్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 26న మిస్సింగ్ కేసు నమోదు అయ్యింది. కాగా, జడ్చర్ల మండలం నక్కలబండ తండా సమీపంలో మేఘనాథ్‌కుంట వద్ద రాఘవేందర్ మృతదేహం లభ్యమైంది. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా ఉందని, మృతదేహం దుర్వాసన వస్తోందని తెలిపారు. తన భర్త రాఘవేందర్ అనారోగ్య సమస్యల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని, ఎవరిపై అనుమానం లేదంటూ భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తెలకపల్లి, జనవరి 30 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలో అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ పరుశరాముడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నడిగడ్డ గ్రామానికి చెందిన మల్లేష్ ట్రాక్టర్‌లో గ్రామ శివారులోని దుందుభీ వాగు నుంచి ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ వివరించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తెలకపల్లి, జనవరి 30 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గౌతంపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం తెలకపల్లి పోలీస్‌స్టేషన్ ముందు ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలిలా ఉన్నాయి. మల్లేష్ అనే వ్యక్తికి సంబంధించిన పశువులు పక్కవారి పొలంలో పడగా వారు మల్లేష్‌పై తెలకపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మనస్థాపానికి గురైన మల్లేష్ ఆత్మహత్యాయత్నం చేశాడు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దొంగతనం కేసులో దోషికి మూడేళ్ల జైలు శిక్ష

గోపాల్‌పేట, జనవరి 30 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని ఓ దుకాణంలో దొంగతనం కేసులో దోషికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానాను కోర్టు విధించినట్లు సీఐ మహేశ్వరరెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది ఫిబ్రవరి ఎనిమిదో తేదీన గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన వల్లెపు శ్రీనివాసులు తన కిరాణం షాపు మూసుకొని రాత్రి ఇంటికి వెళ్లి పడుకున్నాడు. ఉదయం ఆరు గంటలకు షాపు వద్దకు వచ్చి చూడగా షాపు తాళాలు విరగ్గొట్టి ఉన్నాయి. దొంగతనం జరిగినట్లు గుర్తించిన అతను షాపులోకి వెళ్లి పరిశీలించగా రూ.15 వేల నగదు, నాలుగు నూనె డబ్బాలు, 20 తులాల వెండి వస్తువులు, ఒక టీవీ, కొన్ని వస్తువులు దొంగిలించబడ్డాయని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై మల్లేష్ కేసు దర్యాప్తు చేసి ఈ దొంగతనం కేసులో పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామానికి చెందిన పిచ్చుకుంట్ల వెంకటేష్‌పై కోర్టులో చార్జిషీట్ వేశారు. నాటి నుంచి వనపర్తి జిల్లా సెకండ్ అడిషనల్ కోర్టులో ఈ కేసు నడుస్తూ వచ్చింది. మంగళవారం న్యాయస్థానం అతనికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ రక్షిత కె.మూర్తి కేసు దర్యాప్తు చేసిన పోలీస్ అధికారులను, ప్రాసిక్యూషన్ సమయంలో సపోర్టు చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను, కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందిని అభినందించారు.

అమరుల సేవలు మర్చిపోలేనివి

- అమరుల సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్

- గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించిన రవి నాయక్



మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ జి. రవినాయక్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 30 : దేశం కోసం ప్రాణాలు అర్పించి అమరులైన వారి సేవలు మర్చిపోలేనివని కలెక్టర్ జి. రవి నాయక్ అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి అమరుల స్మృత్యర్థం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతం త్ర్యం కోసం ఎంతో మంది ప్రాణాలు అర్పించారని, వారి స్మృత్యర్థం ప్రతి సంవత్సరం జనవరి 30న అమర వీ రుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జనవరి 30వ తేదీ అమర వీరుల దినోత్సవంతో పాటు, దేశం కోసం ప్రాణాలర్పించిన మహాత్మాగాంధీ వర్ధంతిని సైతం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్, ఐఅండ్‌పీఆర్‌ఏడీయు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభ్యంతరాలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 30 : ఓటరు జాబితాపై వచ్చిన అన్ని అభ్యంతరాలను జాప్యం లేకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. రవినాయక్ ఆదేశించారు. మంగళవారం ఆయన ఓటరు నమోదుకై వచ్చిన కొత్త ఫారాలు, మార్పులు, చేర్పులు అలాగే అభ్యంతరాల పరిష్కారాలపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత అక్టోబరు నాటికి కొత్తగా ఓటరు నమోదు, మార్పు చేర్పులకై మూడు నియోజకవర్గాలలో కలిపి వచ్చిన ఫారాలలో కేవలం 49 ఫారాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, అందువల్ల మంగళవారం సాయంత్రం నాటికి వాటిని పరిష్కరించాలని సూచించారు. మహబూబ్‌నగర్ ఈఆర్వో, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జడ్చర్ల ఈఆర్వో, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, దేవరకద్ర ఈఆర్వో, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, అందరు ఏఈఆర్వోలు ఈ టెలీకాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 30 : పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవంత్సరం క్యాలెండర్‌ను మంగళవారం కలెక్టర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమలో పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె. వెంకటయ్య గౌడ్, ప్రధానకార్యదర్శి వెంకటస్వామి, ఉపాధ్యక్షులు జాహంగీర్, కోశాధికారి నాగరాజు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను అరికట్టాలి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 30 : గంజాయి వంటి మత్తు పదార్థాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ జి. రవినాయక్ అన్నారు. మంగళవారం ఐడీవోసీలోని తన చాంబర్‌లో మత్తు కారక మందులు, మానసిక ప్రభావకారక పదార్థాల జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలో జాతీయ రహదారి నిడివి ఉక్కువ ఉండడం, రహదారి సౌకర్యం బాగా ఉండడం వల్ల గంజా రవాణకు అనుకూల పరిస్థితులున్నాయని, యువత, విద్యార్థులు, మత్తుపదార్థాల బారీన పడకుండా పూర్తి స్థాయిలో గాంజా, ఇతర మత్తు పదార్థాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి జిల్లా స్థాయికమిటీ గాంజా నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. కళాశాలలతో పాటు, పాఠశాలలు, మధ్యలో బడిమానేసిన పిల్లలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, యాచకులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ప్రొబేషనరీ ఐపీఎస్ చిత్తరంజన్, అదనపు ఎస్పీ రాములు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కృష, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రహమాన్, అధికారులు హాజరయ్యారు.

కాలుష్య నివారణకు తనిఖీలు నిర్వహించాలి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 30 : పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం పట్ల తాగునీరు, వ్యవసాయ పంటపొలాలు, జంతువుల వంటి వాటికి హాని కలగకుండా ఎప్పటికప్పుడు నిరంతర తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీలోని తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కాలుష్య నియంత్రణ మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల కారణంగా వెలువడే కాలుష్యాన్ని నివారించేందుకు గాను ప్రతీ నెల 12న జిల్లా స్థాయి కమిటీ జడ్చర్ల సమీపంలో పోలెపల్లి సెజ్‌లో ఉన్న పరిశ్రమలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి నివేదిక అందించాలని ఆదేశించారు. పోలెపల్లి సెజ్‌లోని పరిశ్రమలకు అవసరమైన తాగునీటిని మిషన్ భగీరథ ద్వారా చేసేందుకు ఇదివరకె చేపట్టిన పనులను వేగంవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా పరిశ్రమల మేనేజర్ బాబురావు, కాలుష్యనియంత్రణ మండలి సహాయ పర్యావరణ శాస్త్రవేత్త విద్యుల్లత, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ, మత్స్య శాఖ ఏడీ రాధారోహిణి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్, గ్రౌండ్ వాటర్ డీడీ రాజేందర్, టీఎస్ఐఐసీ తదితరశాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

విద్య, వైద్యానికి పెద్దపీట : ఎమ్మెల్యే జీఎంఆర్



సబ్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, జనవరి 30 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గూరకొండ గ్రామంలో హెల్త్ సెంటర్, ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్ ప్రారం భానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మీ ప్రభుత్వ పదేళ్ల ఉన్నప్పుడు ఏం అభివృద్ధి చేశారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నావని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం వచ్చి 60 రోజులు కూడా కాలేదని, అయినప్పటికీ అధికారంలోకి వచ్చిన రోజే రెండు గ్యారెంటీలను అమలు చేశామని గుర్తు చేశారు. వచ్చేనెలలో మరో రెండు గ్యారెంటీలను అమలు చేస్తామని తెలిపారు. మీరు ఏలుబడిలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ఇప్పుడు ఏమి ముఖం పెట్టుకొని అడుగుతున్నావు అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, సర్పంచ్ ఉషనప్ప, మాజీ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, మండల నాయకులు అదిహన్మంత్‌రెడ్డి, ఫారుక్‌అలీ, ఊషన్న, అశోక్, రాములు రామాంజనేయులు, రాఘవులు, బచ్చన్న, ఎంపీడీవో శ్రీనివాసులు, వైద్యాధికారి శరత్‌చంద్ర పాల్గొన్నారు.

రాచాలలో హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

అడ్డాకుల, జనవరి 30 : మూసాపేట మండలంలోని జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాచాలలో మంగళవారం దేవరకద్ర శాసనసభ్యుడు జి.మధుసూదన్‌రెడ్డి హెల్త్‌సెంటరును ప్రారంభించారు. వైద్యాధికారి షబానా, సర్పంచు తిరుపతయ్య, వైస్ ఎంపీపీ రాధిక, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

అడ్డాకుల : మండల కేంద్రానికి చెందిన చిన్న కాశన్న లివర్ సంబంధిత సమస్యతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరగా మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మెరుగైన వైద్యచికిత్స కోసం బాధిత కుటుంబ సభ్యులకు రూ.1.25000 విలువ చేసే ఎల్‌వోసీని అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీహరి, డీసీసీ కార్యదర్శి విజయమోహన్‌రెడ్డి, మైను, నాగిరెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అడ్డాకుల, జనవరి 30 : విద్యార్థులు బాల్యదశ నుంచే పర్యావరణం పట్ల అవగాహన పెంచుకుంటూ దాన్ని సమాజిక బాధ్యతగా కాపాడాలని సీజీఆర్ సంస్థ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్ అన్నారు. మంగళవారం మూసాపేట మండల పరిధిలోని వేముల ఉన్నత పాఠశాలలో యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమంలో భాగంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.శ్రీనివాస్, సీజీఆర్ ఉపాధ్యాయ మెంటర్ దాసప్ప, ఉపాధ్యాయులు శ్రీకాంత్, బాలరాజు, నాగరత్నం, జయమ్మ, పురుషోత్తం పాల్గొన్నారు.

మండల స్థాయి సాంఘికశాస్త్ర ప్రతిభా పాటవ పరీక్ష

హన్వాడ, జనవరి 30 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా సాంఘిక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు మండల స్థాయి సాంఘికశాస్త్ర ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహించారు. 11 పాఠశాలల విద్యార్థులు పోటీ పరీక్ష రాయగా మునిమోక్షం పాఠశాలకు చెందిన అంకిత మొదటి స్థానం, హన్వాడ ఉన్నత పాఠశాలకు చెందిన అనిత రెండవ స్థానం, వేపూర్‌కు చెందిన నాగేశ్వరి మూడవ, మునిమోక్షానికి చెందిన భాగ్యలక్ష్మీ నాల్గవ స్థానంలో నిలిచారు. వారికి దివంగత కవిడిదేవి గోపాల్ జ్ఞాపకార్థం భార్య రామలింగమ్మ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, హెచ్‌ఎంలు పద్మావతి, కృష్ణారెడ్డి, నాగరాజు, పాండురంగ, వెంకటస్వామి, విజయలక్ష్మి, రామచంద్రయ్య, విజయకుమార్, సంజీవ్‌రెడ్డి, మున్వర్‌సుల్తానా, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లాను మొదటి స్థానంలో ఉంచడమే లక్ష్యం

- పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీలో ఎమ్మెల్యే, కలెక్టర్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 30 : విద్యలో మహబూబ్‌నగర్ జిల్లాను మొదటి స్థానంలో ఉంచడమే తమ లక్ష్యమని శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఐడీవోసీలో కలెక్టర్ జి. రవినాయక్‌తో కలిసి ఆయన పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే విద్యాయాత్ర పేరుతో రూపొందించిన డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని పేద పిల్లలకు సైతం నాణ్యమైన విద్యను అందించాలన్నా ఉద్దేశంతో డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్ అందజేస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని, సీఎస్ఆర్ కింద మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సుమారు 2,200 మందికి స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. జీవితంలో 10వ తరగతి ముఖ్యమైనదని, అందువలన విద్యార్థులు రానున్న 40 రోజులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. మహబూబ్‌నగర్‌లోనే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసే విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, అంతేకాకా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, యూనివర్సిటీని తీసుకవచ్చేవిధంగా కృషిచేస్తామని, ఐటి కారిడార్‌లో ఇక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించే చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. కలెక్టర్ జి. రవినాయక్ మాట్లాడుతూ జీవితంలో 10వ తరగతి చాలా ముఖ్యమైందని అన్నారు. 3 డి స్టడీ మెటీరియల్‌ను బోధించడం వల్ల వారి మస్తిష్కంలో అలాగే ఉండిపోతుందని ఆయన తెలిపారు. డీఈవో రవీందర్ మాట్లాడారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, సమాచారశాఖ సహాయ సంచాలకులు యు.వెంకటేశ్వర్లు, యునైటెడ్ వేస్ అకాడమీ సీఈఓ భూషణ్, శేఖర్, రష్మి, 5 మంత్రా అకాడమీ సీఈవో కిరణ్, ధన్‌రాజ్, ఏఎంఓ బాలు యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం వారు

వృత్తివిద్యా కళాశాలలో అన్నీ వసతులు కల్పిస్తా : ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : జిల్లా కేంద్రంలోని వృత్తి విద్య జూనియర్ కళాశాలలో అన్నివసతులు కల్పించేలా దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన వృత్తి విద్యాకళాశాలను పరిశీలించారు తన స్వంత నిధులతో విద్యార్థుల వాటర్ ప్లాంట్ మరమతులు చేయించారు. యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన సంస్థనుంచి డ్యుయల్ డెస్కు టేబుల్‌ను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ,విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు .

అహింసతో స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీజీ



గాంధీజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

పాలమూరు, జనవరి 30 : మహాత్మాగాంధీ అహింస పద్ధతిలోనే స్వాతంత్ర్యం తీసుకువచ్చారని టీడీపీ నాయకులు అన్నారు. మంగళవారం గాంధీజీ వర్థంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని గడియారం చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్.బాలప్ప, యాకోబ్, షబ్బీర్, బాలకృష్ణప్యాస్ అంజన్‌కుమార్, కుమార్‌రెడ్డి, వనగంటి శ్రీనివాస్, రమేష్, గౌస్‌బాయి, ఇబ్రహీం, సి.రాజు, టంకసాల వెంకటేష్, అఫ్సర్, సురేష్, కాజుబాయ్, యాదయ్య పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి నివాళులు

జడ్చర్ల : జాతిపిత మహాత్మాగాంధీ 76వ వర్ధంతిని జడ్చర్ల నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించారు. పట్టణంలోని వాసవీకన్యకపరమేశ్వరి ఆర్చి వద్ద గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు మేడిశెట్టి రామకృష్ణ, కాట్రేపల్లి లక్ష్మయ్య, రామ్మోహన్, మధు, చంద్రయ్య, కిశోర్, మంచన గణేష్, గుబ్బ బాలరాజు, ముచ్చర్ల జంగయ్య, ఆలంపల్లి మనోహర్ పాల్గొన్నారు. అలాగే జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని గాంధీ విగ్రహానికి వాసవీక్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చంద్రశేఖర్, ప్రవీణ్, కృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో బీసీ సేన ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీ విగ్రహానికి బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్, కృష్ణకుమార్, నరసింహారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, విష్ణుమూర్తిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● అడ్డాకుల : మండలంలో మంగళవారం జాతిపిత గాంధీజీ వర్ధంతిని విద్యార్థులు, ఉపాధ్యాయులు, మహిళలు, పలు పార్టీల నాయకులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● నవాబ్‌పేట : మహాత్మాగాంధీజీ సేవలు మరువలేనివని తహసీల్దార్ మల్లికార్జున్ రావు, నవాబ్‌పేట సర్పంచ్ గోపాల్ గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్, బాలమ్మ, కార్యదర్శి, నరేష్, శకుంతల పాల్గొన్నారు.

● గండీడ్ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య సిబ్బంది కుష్టువ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేశారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా కుష్టువ్యాధి నిర్మూలన కోసం ప్రతీ ఒక్కరు అవగాహన చేసుకోవాలని డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నోరుజారితే ఖబడ్దార్

- ● మునిసిపల్ మాజీ చైర్మన్‌కు కులాలు ఇప్పుడే గుర్తుకొచ్చాయా
- ● ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచిన ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించం
- ● కౌన్సిలర్ ఆనంద్‌కుమార్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్, జనవరి 30 : చైర్మన్ పీఠానికి ఎసరు పెట్టేసరికి మాజీ మునిసిపల్ చైర్మన్ కేసీ నర్సింహులుకు ఇప్పుడు కులాలు, మతాలు గుర్తుకు వస్తున్నాయని, అదే మీ పాలనలో బీసీలకు అవమానాలు, అన్యాయం జరుగుతున్నప్పుడు నవ్వుతూ ఎంజాయ్ చేసిన మీకు ఇవ్వాళ బీసీలు, మున్నూరు కాపులు గుర్తుకు వస్తున్నారా? ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని ఇష్టానుసారంగా మాట్లాడి నోరుజారితే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. మంగళవారం ఆయన తనతోపాటు అవిశ్వాసంలో మద్దతు పలికిన కౌన్సిలర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పదవిపోయిన ఒత్తిడిలో ఆయన ఎమ్మెల్యేపై నోరుజారుతున్నారని, చీము, నెత్తురు అంటూ మాట్లాడటం సరికాదన్నారు. అన్ని వర్గాల ప్రజలు మద్దతుతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి భారీమెజారిటీతో గెలిచారని, అనవసరంగా వ్యక్తిగత ఆరోపణలు చేయవద్దని హెచ్చరించారు. కౌన్సిలర్లను తాను కొనుగోలు చేయలేదని, మీరు మా వద్ద ఉన్న కౌన్సిలర్‌లతో బేరసారాలకు దిగారని, కాల్‌రికార్డులు తమ వద్ద ఉన్నాయన్నారు. మీ పాలన ఎంత మంది బీసీల మధ్య చిచ్చుపెట్టారో మీకు తెలియదా ? వార్డులో ఇద్దరు గొడవ పడితే ఇద్దరిపై కేసులు పెట్టించారని, అన్నదమ్ముల మధ్య చిచ్చుపెట్టారని చెప్పారు. మీరు కూడా ఎన్నో సార్లు బాధపడిన విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు. మీ వెంట ఉన్న 14 మంది కౌన్సిలర్లలో కూడా కొందరు బాధపడుతున్నారని, వాళ్ల కూడా మా వద్ద టచ్‌లో ఉన్నారన్నారు. మావద్ద ఉన్న కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసిన మాట వాస్తవం కాదా అని అన్నారు. మేము 30 మందికి కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చిన మరునాడే పదవికి రాజీనామా చేసి ఉంటే తామంతా హ్యాట్సాఫ్ చెప్పేవాళ్లమని అన్నారు. అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే ఏం పనిచేశారని ప్రశ్నించడం దారుణమన్నారు. మీరు పద్ధతి మార్చుకోకపోతే పాలమూరు ప్రజలంతా ఏకమవుతారన్న సంగతి మరువద్దన్నారు. జిల్లా వ్యక్తి రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్నారని, రానున్న రోజుల్లో అభివృద్ధి ఎలా ఉంటుందో చూయిస్తామన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు షబ్బీర్‌అలీ, గోవింద్, జాజిమొగ్గ నర్సింహులు, మోతీలాల్, గిరిధర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 30 : ఫిబ్రవరి 1 నుంచి చేపట్టే ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో డా.శ్రీధర్‌సుమన్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాలలో పరీక్షల చీఫ్‌సూపరింటెండెంట్లకు, డిపార్ట్‌మెంట్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియల్ రెండవ ఏడాది విద్యార్థులకు నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలపై సమీక్షించారు. ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు జరిగే పరీక్షలకు సంబంధించి విద్యార్థుల హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు అందజేయాలన్నారు. విద్యార్థులు నేరుగా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు జిల్లా వ్యాప్తంగా మొత్తం 47 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ, ప్రైవేట్, కళాశాల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

'అద్దె వాహనాల బిల్లులు చెల్లించాలి'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 30 : ఉమ్మడి పాలమూరు జిల్లాలలోని విద్యాశాఖ కార్యాలయాల్లో సమగ్ర శిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో పనిచేసే అధికారులకు నడిచే అద్దె వాహనాలకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ మంగళవారం ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు అద్దె వాహనాల యజమానులు హైదరాబాద్‌లో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలను ఆయనకు వివరించారు. నాల్గునెలలుగా రావాల్సిన బిల్లులురాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే బిల్లులు చెల్లించాలని కోరిననట్లు వారు తెలిపారు. తాము వాహనాల ఈఎంఐలు, డీజిల్ బిల్లు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామని అయన దృష్టికి తెచ్చామని, దీని సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

కుమ్మరి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

పాలమూరు, జనవరి 30 : తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం జిల్లా కమిటీ క్యాలెండర్‌ను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం జిల్లా కేంద్రంలోని కుమ్మరివాడిలో ఆవిష్కరించారు. కుమ్మరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో బుగ్గన్న, టికె మల్లేష్, వి.రామచంద్రయ్య, రవిశేఖర్, మల్లేష్, రవిశేఖర్, మల్లేష్, డి.వెంకటేష్, నాగప్ప, రవికుమార్, యుగందర్, అంజనేయలు పాల్గొన్నారు.

మళ్లీ వాయిదాపడిన అడ్డాకుల మండల సభ

అడ్డాకుల, జనవరి 30 : అడ్డాకుల మండల సభ మళ్లీ వాయిదా పడింది. ఈ నెల 24 జరగాల్సిన సభ కోరంలేక వాయిదా పడడంతో 30న మండల సభను ఖచ్చితంగా నిర్వహిస్తామని సభకు తెల్పిన ఎంపీడీవో మంజుల మంగళవారం మండల పరిధిలోని రాచాలలో హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎంఎల్‌ఏతో పాటుగా పాల్గొన్నది. మధ్యాహ్నం దాటినా ఆమె మండల సభకు హాజరు కాలేదు. దాంతో చాలా సేపు వేచి చూసిన ఎంపీటీసీలు, గౌరవ సర్పంచుల పట్ల ఎంపీడీవో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు రంగన్న గౌడ్ ఆధ్వర్యంలో తీవ్ర అసహనంతో మండల సభను బహిష్కరించారు. కాగా కొంత ఆలస్యంగా మండల కేంద్రానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఎంపీటీసీలు సభను బహిష్కరించారనే సమాచారం తెలియడంతో వెనుదిరిగిపోయారు.

గిరిజన ఉద్యోగుల సంఘం ఎన్నిక

హన్వాడ, జనవరి 30 : జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షునిగా హన్వాడ మండలంలోని వేపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవిజానాయక్ ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్న సందర్భంగా నియమించినట్లు దేవిజానాయక్ తెలిపారు. మంగళవారం నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

పాలమూరు, జనవరి 30 : బుధవారం జిల్లా కేంద్రంలో డయల్ యువర్ డిపోమేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31వ తేదీ సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ డీఎం పేరుమీద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ డిపో పరిధిలోని ఆర్టీసీకి సంబంధించిన సమస్యలపై ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. సెల్ నెంబర్ : 99592 26286కు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.

విశ్వకర్మలు దరఖాస్తు చేసుకోవాలి

హన్వాడ, జనవరి 30 : చేతి వృత్తుల వారికి చేయూతను అందించేందుకు ప్రధానమంత్రి అమలు చేస్తున్న విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ మండల యువ నాయకుడు రఘురాంగౌడ్ కోరారు. మంగళవారం పెద్దదర్పల్లిలో పార్టీ ఆధ్వర్యంలో చేతి వృత్తుల వారు ఈ పథకంలో రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

గెలుపు కోసం పని చేద్దాం : బీజేపీ

హన్వాడ, జనవరి 30 : బీజేపీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త పని చేయాలని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం హన్వాడలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ ఆదేశాల మేరకు అందరు గ్రామాలలో ఉండి పని చేయాలన్నారు. జాతీయ నాయకత్వం పార్లమెంట్ ఎన్నికలలో గెలుపు కోసం కష్టపడాలని, అందుకు అందరు కలిసి పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ వెంకటయ్య, కొండ బుచ్చిరెడ్డి, బుద్దన్న, రఘురాంగౌడ్ పాల్గొన్నారు.

'ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి'

దేవరకద్ర, జనవరి 30 : దేవరకద్రలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే జీఎంఆర్ ఆదేశాల మేరకు మంగళవారం అదనపు కలెకటర్ మోహన్‌రావుకు మాజీ జడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి మండల నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. రెండేళ్ల నుంచి మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్ లేకపోవడంతో వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆధార్ సెంటర్ లేకపోవడంతో మోహన్‌రావు మాట్లాడుతు మండల కేంద్రంలోని త్వరలోనే ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు కృషి చేస్తొన్నారు. ఆదేవిధంగా ఆర్టీసీ ఆదికారులను కలిసి బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా చూడాలని కోరారు. గోవర్ధన్‌రెడ్డి, అదిహన్మంతురెడ్డి, అంజన్‌కుమార్‌రెడ్డి, ఫారుక్‌అలీ పాల్గొన్నారు.

మహిళను కొట్టి చంపిన వ్యక్తులపై కేసు

మహబూబ్‌నగర్, జనవరి 30 : బాణమతి చేస్తుందన్న అనుమానం, పాతకక్షలతో మహిళను కొట్టిచంపిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహబూబ్‌నగర్ మండలం కోటకదిరకు చెందినమేకల నాగమ్మ సోమవారం అర్ధరాత్రి పాలివాళ్ళ కొట్టిచంపడంతో ఆమె కూతురు మేకల అచ్చమ్మ మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదుచేసింది. మేకల అచ్చమ్మకు కొడుకు కూతురు ఉండగా, కూతురును కౌకుంట్ల గ్రామం ముచ్చింతల గ్రామానికి చెందిన నరేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొన్నాళ్ళక్రితమే మేకల నాగమ్మ భర్త కొడుకు చనిపోవడంతో ఆమె ఒక్కరే ఇంటివద్ద ఉంటున్నారు. తరచూ దాయాదులతో గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో సోమవారం రాత్రి గ్రామానికి చెందిన వ్యక్తులు కూతురుకు ఫోన్‌చేసి మీ అమ్మను దాయాదులు తీవ్రంగా కొట్టిచంపారని తెలపడంతో ఆమె హుటాహుటిన కోటకదిరకు బయలుదేరి వచ్చింది. అప్పటికే ఆమె తీవ్రగాయాలతో చనిపోయి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదుచేసింది. బాణమతి, పాతకక్షలను మనసులో పెట్టుకుని దాయాదులు బడాల సత్తయ్య, బడాల చంద్రయ్య, చెన్నగాళ్ళ నర్సమ్మలు కొట్టి చంపారని ఇచ్చిన ఫిర్యాదుమేరకు రూరల్ పోలీసులు కేసు నమెదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశం

చిన్నచింతకుంట, జనవరి 30 : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రతీ గ్రామంలో బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని కార్యకర్తల సమావేశంలో చర్చించారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్, మండల అధ్యక్షులను కార్యకర్తలు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, రహమత్, కో-ఆప్షన్ మహెమూద్, నాయకులు శ్రీనివాసులుగౌడ్, భరత్, రామలింగం, మహలక్ష్మీ, అహ్మద్ పాల్గొన్నారు.

గోప్లాపూర్ వద్ద రోడ్డు మరమ్మతు



గోప్లాపూర్ వద్ద రోడ్డు పనులు చేయిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

భూత్పూర్, జనవరి 30 : మునిసిపాలిటీ పరిధిలోని గోప్లాపూర్ గ్రామ శివారులో ఉన్న దాదాపుగా కిలోమీటర్ వరకు రోడ్డు చాలా రోజుల నుంచి గుంతల మయమై ఉండడంతో వాహనదారులు, ప్రాయాణికులు తీవ్ర ఇబ్బదులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని వాహనాదారుల ద్వారా తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తన సొంత ఖర్చులతో సుమారుగా రూ.లక్షకు పైగా వెచ్చించి గుంతల మయంగా ఉన్న రోడ్డును మరమ్మతులు చేయించారు. చాలా ఏళ్ల నుంచి భూత్పూర్ నుంచి గోప్లాపూర్ వరకు రోడ్డు గుంతల మయంగా మారి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కల్గిస్తూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారని, ఇదే విషయాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం ఆయన సూచనల మేరకు తన సొంత డబ్బులతో తాత్కాలిక మరమ్మతు చేయించామని కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాసగౌడ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లాలునాయక్ పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ప్రాంతాన్ని తనిఖీ చేసిన అదనపు ఎస్పీ

జడ్చర్ల, జనవరి 30 : జడ్చర్ల మునిసిపాలిటీలోని ఎర్రగుట్ట సమీపంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ప్రాంతాన్ని మంగళవారం అదనపు ఎస్పీ రాములు తనిఖీ చేశారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో లబ్ధిదారులు కాకుండా, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఆక్రమించి నివాసం ఉంటుండడంతో వారిని ఖాళీ చేయించేందుకు ముందస్తుగా ఆ ప్రాంతాన్ని పరిశీలించినట్లుగా తెలిసింది. ఆ ప్రాంతంలో తన వాహనంలోనే కూర్చుని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ప్రాంతాన్ని పరిశీలించడం గమనార్హం.



జడ్చర్ల మునిసిపాలిటీలోని ఎర్రగుట్ట వద్ద నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ప్రాంతాన్ని వాహనంలో కూర్చొనే పరిశీలించిన అదనపు ఎస్పీ రాములు

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అప్పియాచిన్నమ్మ



విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ

జడ్చర్ల, జనవరి 30 : కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అప్పియాచిన్నమ్మ అన్నారు. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్, కెరియర్ గైడెన్స్ సెల్, ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ టు కార్పొరేట్ ప్రోగ్రాంలో ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో అత్యధిక ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, అందుకనుగుణంగా స్కిల్స్‌పై పట్టు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రైవేట్ రంగ సంస్థలలో ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు యాదయ్య, మంజుల, సుభాషిణి, వీరప్రతాప్, మాధవి, అనిత, భార్గవిలత, జగన్ పాల్గొన్నారు.